కోరుట్లలో ఎమ్మెల్యే సంజయ్ నిర్వహించిన పాదయాత్రకు తరలివచ్చిన రైతులు, పార్టీ శ్రేణులు

కదం తొక్కిన కర్షకలోకం

- కాంగ్రెస్ సర్కారుపై రైతుల ఫైర్
- సీఎంపై అన్నదాతల ఆగ్రహం
- ఎమ్మెల్యే సంజయ్ పాదయాత్రకు సాదరస్వాగతం పలికిన రైతులు

జగిత్యాల, నవంబర్ 12 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల మంగళవారం రైతు పాదయాత్ర చేపట్టారు. ఉదయం 9.30 గంటలకు కోరుట్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద పాదయాత్రను మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ యాత్ర వెంకటాపూర్, మోహన్‌రావుపేట, మేడిపల్లి, తాటిపల్లి, చల్‌గల్ మీదుగా జగిత్యాలకు చేరుకున్నది. సుమారు 25 కిలోమీటర్లు సాగిన ఈ యాత్రకు కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి, వేములవాడ, చొప్పదండి నియోజకవర్గాల నుంచి రైతులు వేలాదిగా తరలివచ్చారు. దారిపొడవునా రైతులు ఉత్సాహంగా కదిలారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. 'రేవంత్ నాటకం.. రుణమాఫీ బూటకం', 'మోసానికి కేరాఫ్ కాంగ్రెస్.. దగాకు చిరునామా రేవంత్' 'కొర్రీలొద్దు, కోతలొద్దు.. ఆంక్షల్లేని రుణమాఫీ కావాలి' అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఇటు ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్లకు దారిపొడవునా ప్రజలు ఘనంగా స్వాగతించారు. వెంకటాపూర్‌లో రైతులు నాగలిని అందించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. చల్‌గల్‌లో యాత్రకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు స్వాగతం పలికారు. అక్కడి నుంచి సాయంత్రం 5గంటలకు జగిత్యాలకు బస్టాండ్‌కు చేరుకున్నారు. పాదయాత్ర విజయవంతం కావడంతో జిల్లాలోని గులాబీ శ్రేణుల్లో సమరోత్సాహం కనిపించింది. 25 కిలోమీటర్ల మేర రైతులు పెద్దసంఖ్యలో పాల్గొనడం, రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినదించడం గులాబీదండులో బలాన్ని పెంపొందించింది. మొత్తంగా ఈ రైతు పాదయాత్ర ప్రజల్లో ఉత్సాహాన్ని, పోరాట స్ఫూర్తిని రగిలించిందన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

వడ లోడు వదిలి.. నోట లోడులో బిజీ

- మహారాష్ట్రకు మూటలు పంపడంలోనే సీఎం రేవంత్ బిజీ
- కాంగ్రెస్ పాలనలో రైతులు పండించిన ధాన్యం దళారుల పాలు
- రుణమాఫీ విషయంలో రైతులకు చేసిన మోసానికి చెంపలేసుకో
- రైతులకు వడ్డీతో సహా 2 లక్షల రుణమాఫీ చేయాల్సిందే
- 15 వేల రైతు భరోసా, అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలి
- రుణమాఫీయే ముఖ్యమని రాజీనామాకు సిద్ధమైన
- సంజయ్ పాదయాత్రట్రైలర్ మాత్రమే
- రేవంత్‌రెడ్డికి సినిమా చూపిస్తం
- రైతు పాదయాత్రలో హరీశ్‌రావు

జగిత్యాల కొత్తబస్టాండ్ వద్ద సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, చిత్రంలో మాజీ మంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పాదయాత్రను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

జగిత్యాల/ రాజన్న సిరిసిల్ల, నవంబర్ 12 (నమస్తే తెలంగాణ) : కల్లాల్లో ధాన్యం కొనాలని, లారీలో వడ్ల లోడు ఎత్తాలని రైతులు అడుగుతుంటే, సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం మహారాష్ట్రకు డబ్బు మూటల లోడ్లు ఎత్తే పనిలో బిజీగా ఉన్నాడని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎద్దేవాచేశారు. అబద్ధపు హామీలు, తప్పుడు వాగ్దానాలతో గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి పాలన రైతుల పాలిట శాపంలా మారిందని, రైతుల ధాన్యం దళారుల పాలైందని ఆవేదన వ్యక్తంచేశారు. రూ.500 బోనస్ బోగస్ అయిందని, రేవంత్ నిర్వాకంతో క్వింటాల్ ధాన్యంపై రైతు వెయ్యి రూపాయలు నష్టపోతున్నాడని వాపోయారు. 'ఇక్కడ బోనస్ ఇయ్యడు కాని, మహారాష్ట్ర ఎన్నికల్లో వరికి బోనస్ ఇస్తున్నమని రేవంత్‌రెడ్డి అబద్ధపు ప్రచారం చేస్తున్నడు' అంటూ మండిపడ్డారు. వడ్ల కొనుగోళ్ల సీజన్ వస్తున్నదంటే కేసీఆర్ నెల రోజుల ముందు నుంచే సమీక్షలు పెట్టేవారని, 'సంచులు ఉన్నాయా.. బారదాన్లు ఉన్నాయా.. సుతిలి ఉన్నదా.. టార్పాలిన్లు ఉన్నాయా అని నాడు పౌర సరఫరాల శాఖ మంత్రి గంగులను, పైసలున్నయా.. వడ్లు కొన్న 24 గంటల్లోనే రైతులకు పైసలియ్యాలె' అని ఆర్థిక మంత్రి అయిన నన్ను కేసీఆర్ అప్రమత్తం చేసేవారు' అని గుర్తుచేశారు. జగిత్యాల జిల్లా కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల మంగళవారం కోరుట్ల నుంచి జగిత్యాల వరకు రైతులతో కలిసి చేపట్టిన పాదయాత్రకు హరీశ్ సంఘీభావం తెలిపారు. అనంతరం జగిత్యాల కొత్తబస్టాండ్ చౌరస్తాలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. 'జగిత్యాల జిల్లాలో ప్రారంభమైన రైతుల పాదయాత్ర ట్రైలర్ మాత్రమే..సీఎం రేవంత్‌రెడ్డికి ముస్మందు 70 ఎంఎం సినిమా ఉంటుంది' అని హెచ్చరించారు. సంజయ్ కల్వకుంట్ల ఇక్కడి ప్రజలకు మంచి ఎమ్మెల్యేగానే తెలుసునని, తనకు మాత్రం మంచి డాక్టర్‌గా తెలుసని చెప్పారు. యశోద దవాఖానలో పనిచేసేటప్పుడు ఎవరికి ఆపద వచ్చినా ఫోన్‌చేస్తే బిల్లు మాఫీ చేసే వారని గుర్తుచేశారు. వెన్నెముక శస్త్ర చికిత్స చేసే డాక్టర్‌గా మంచి పేరు తెచ్చుకున్న సంజయ్ దేశానికి వెన్నెముక అయిన రైతుల కోసం 25 కిలోమీటర్లు పాదయాత్ర చేయడం అభినందనీయమన్నారు.

హామీల్లో ఒక్కటైనా నెరవేరిందా?

ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో ఒక్కటైనా నెరవేరిందా అని హరీశ్ ప్రశ్నించారు. ఎన్నికల ముందు ఒకటి రెండు రోజుల్లో రైతుబంధు పైసలు వేస్తామని తాను ప్రకటించానని, ఎలక్షన్ కమిషన్ పర్మిషన్ కూడా ఇచ్చిందని, అయినా రేవంత్‌రెడ్డి ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేసి రైతుబంధును అడ్డుకున్నది అందరూ గుర్తుచేసుకోవాలని చెప్పారు. 'ఇప్పుడైతే రూ.10 వేలు, కాంగ్రెస్ వచ్చినంక రూ.15 వేలు వస్తాయని ఎన్నికల్లో రైతులను రేవంత్‌రెడ్డి నమ్మించి మోసం చేసిండు' అని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే పదవి కంటే 60 లక్షల మంది రైతులకు రుణమాఫీ కావడమే ముఖ్యమని భావించి తాను రాజీనామాకు సిద్ధమయ్యానని గుర్తుచేశారు. 'రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తా, మళ్లీ ఎన్నికల్లో పోటీ చేయనని అంటే, సై అని చెప్పిన రేవంత్‌రెడ్డి ఆ తర్వాత పారిపోయిండు.. పంద్రాగస్టు వరకు పూర్తి రుణమాఫీ అన్నడు.. చేయలేదు. మళ్లీ వెంటపడితే దసరా అన్నాడు.. అటు దసరా పోయింది, దివిలి పోయింది.. ఇప్పుడు సోనియమ్మ పుట్టిన రోజు డిసెంబర్ 9 అంటున్నడు' అని విమర్శించారు. సీఎం మాటలు నమ్మి వేలాది మంది రైతులు రూ.రెండు లక్షల పైన బకాయిలు కట్టారని, వారికి ఇంత వరకు రుణమాఫీ కాలేదని చెప్పారు. వారికి వడ్డీతో కలిసి రూ.రెండు లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీపై మాటతప్పిన రేవంత్‌రెడ్డి ఎములడ రాజన్న దగ్గర తప్పుజరిగిందని చెప్పి చెంపలేసుకోవాలని సూచించారు.

వరద కాల్వను కేసీఆర్ రిజర్వాయర్‌లా మార్చిండు

ఒకప్పుడు జగిత్యాలలో మంచి నీళ్ల కోసం ధర్నా చేసే పరిస్థితి ఉండేదని, దాన్ని నాటి సీఎం కేసీఆర్ మార్చివేశారని హరీశ్ గుర్తుచేశారు. వరద కాలవను రిజర్వాయర్‌గా మార్చి, మోటర్లు పెట్టి రివర్స్ పంపింగ్ ద్వారా నీళ్లు తెచ్చి, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లా మార్చారని, చెరువులన్నిటికీ తూములు పెట్టి వరద కాలువ ద్వారా నీళ్లందించి రెండు పంటలు పండేలా చేసిన మహానుభావుడు కేసీఆర్ అని కొనియాడారు. రైతుల కోసం అన్నీ చేసి, దేశంలో రైతుల సీఎంగా కేసీఆర్ పేరు తెచ్చుకుంటే, రేవంత్‌రెడ్డి బూతుల సీఎంగా పేరు సంపాదించారని ఎద్దేవాచేశారు. జగిత్యాల అంటేనే చైతన్యవంతమైన పోరాట పురిటిగడ్డ అని, జైత్రయాత్ర సాగించిన ప్రాంతమని, అలాంటి జగిత్యాలలో ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల పాదయాత్రతో పోరాటం ప్రారంభించారని తెలిపారు. రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా కండ్లు తెరవాలని, ఆయన, ఆయన మంత్రులు భూమి మీద తిరగాలని చురకలంటించారు. 'గాలి మోటర్లలో కాదు, రైతుల చేన్లల్లో, కల్లాల్లో తిరగాలి' అని హితవుపలికారు.

> కల్లాల్లో ధాన్యం కొనుగోలు కోసం రైతులు 20 రోజులుగా పడిగాపులు కాస్తున్నారు.. రాత్రి పందులు, పగలు కోతులతో భయపడుతున్నరు.. అకాల వర్షాలు పడితే తమ కష్టమంతా బూడిదలో పోసిన పన్నీరేనని ఆవేదన చెందుతున్నరు.. అయినా ఈ ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదు. – హరీశ్‌రావు

కేసీఆర్ గురించి మాట్లాడే హక్కు రేవంత్‌కు లేదు

కేసీఆర్‌పై మాట్లాడే నైతిక హక్కు రేవంత్‌రెడ్డికి లేదని హరీశ్ స్పష్టం చేశారు. ఇటీవల కేసీఆర్ మాట్లాడిన మాటల్లో తప్పేమున్నదని ప్రశ్నించారు. 'మీ పాలనలో తెలంగాణ ప్రజలు ఏమి పొందారో? ఏమి కోల్పోయారో? చెప్పడానికి నువ్వు సిద్ధమా?' అంటూ సవాల్ చేశారు. వేములవాడలో రాజన్నను దర్శించుకున్న అనంతరం బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు నివాసంలో మాజీ మంత్రి గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, ఉద్యోగ సంఘం నాయకుడు దేవి ప్రసాద్‌తో కలిసి హరీశ్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంలో, తాగు, సాగునీరు, కరెంటు, విద్య ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని రంగాల్లో కాంగ్రెస్ సర్కార్ తీవ్రంగా విఫలమైందని ధ్వజమెత్తారు. బతుకమ్మ ఆర్డర్లు ఇవ్వకుండా వస్త్ర పరిశ్రమను సంక్షోభంలోకి నెట్టి, నేతన్నలు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి తెచ్చాడంటూ సీఎంపై మండిపడ్డారు.

ఇందిరమ్మ రాజ్యంలో ఇంత అధ్వానమా?

'ఇందిరమ్మ రాజ్యంలో ఇదేం పరిస్థితి..పురుగులేని అన్నం కోసం విద్యార్థులు రోడ్డెక్కాల్సిన దుస్థితి ఎందుకు? రాష్ట్రంలోని గురుకులాలు అధ్వాన పరిస్థితికి చేరితే విద్యాశాఖ మంత్రిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డికి చీమ కుట్టినట్టు కూడా లేదు' అంటూ హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. గురుకులాల ఖ్యాతిని కేసీఆర్ ఎవరెస్ట్ శిఖరాన నిలబెడితే, రేవంత్‌రెడ్డి 11 నెలల పాలనలో అధఃపాతాళానికి దిగజార్చారని దుయ్యబట్టారు. 'మీ అసమర్థ పాలనకు నాగర్‌కర్నూల్ జిల్లాలోని వెల్దండ గురుకుల విద్యార్థులు చేపట్టిన నిరసనే నిదర్శనం' అని చురకలంటించారు. సర్కారు తక్షణమే స్పందించి గురుకులాల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఏవీ

'విద్యార్థులకు విద్యా భరోసా కార్డులు ఇచ్చారా?, ఏడాదిలో నిరుద్యోగులకు ఇస్తామన్న రెండు లక్షల ఉద్యోగాలు ఏవీ' అని హరీశ్ ప్రశ్నించారు. కేసీఆర్ నోటిఫికేషన్ ఇచ్చి, పరీక్ష పెట్టి ఫలితాలు ఇచ్చిన 40 వేల ఉద్యోగాలకు నియామక పత్రాలిచ్చి అన్నీ తామే చేశామని రేవంత్‌రెడ్డి చెప్పుకొంటున్నారని మండిపడ్డారు. ఒక్క ఉద్యోగం ఇవ్వకుండానే రూ.300 కోట్లు ఖర్చు పెట్టి పేపర్లలో ఘనంగా ప్రకటనలు ఇచ్చాడు తప్ప నిరుద్యోగులకు ఉద్యోగాలివ్వలేదని దుయ్యబట్టారు. పోలీసుల చేతులతో పోలీసోళ్ల భార్యలు, పిల్లలను కొట్టించిన దిక్కుమాలిన ముఖ్యమంత్రి అని ఆగ్రహం వ్యక్తంచేశారు. గురుకులాల్లో విద్యార్థులను కేసీఆర్ ఐఏఎస్‌లను, ఐపీఎస్‌లను, డాక్టర్లను, ఇంజినీర్లను చేయడమే గాక, ఎవరెస్ట్ శిఖరం ఎక్కిస్తే.. రేవంత్‌రెడ్డి మాత్రం రోడ్లెక్కించాడని ఎద్దేవాచేశారు. 11 నెలల్లో గురుకులాల్లో ఇప్పటి వరకు 37 మంది విద్యార్థులు చనిపోయారంటే ప్రభుత్వం పనితీరు ఎలా ఉన్నదో అర్థం చేసుకోవచ్చని చెప్పారు. రైతుబంధు, బతుకమ్మ చీరెలు, కేసీఆర్ కిట్లు, గొర్రె పిల్లలు, చేప పిల్లలు ఇట్ల ఒక్కటేమిటి కేసీఆర్ ఇచ్చిన అన్నింటినీ రేవంత్‌రెడ్డి బంద్ పెట్టాడని గుర్తుచేశారు.

> అసెంబ్లీ ఎన్నికల్లో బాండ్ పేపర్లు, ఎంపీ ఎన్నికల్లో దేవుళ్లపై ఒట్లు.. ఇటీ రేవంత్ ముచ్చట.. వేములవాడ రాజన్న, కొండగట్టు అంజన్న, ధర్మపురి నర్సన్న మీద ఒట్లుపెట్టి మరి రుణమాఫీ చేస్తనని రేవంత్‌రెడ్డి రైతులను నమ్మించి మోసం చేసిండు. మోసం చేసిన మనిషిని ఏమంటరో రైతులే చెప్పాలె.. –హరీశ్‌రావు

> కేవలం తరాజులో పెట్టి ఎమ్మెల్యేలను కొనడం తప్ప 11 నెలల పాలనలో రేవంత్‌రెడ్డి చేసిందేమిటి? రానున్న రోజుల్లో రైతులు అవిశ్రాంత పోరాటం చేసి ప్రభుత్వం మెడలు వంచి హామీలు నెరవేర్చుకోవాలి.. రైతుల కోసం బీఆర్ఎస్ నాయకులమంతా నిరంతరం పోరాటం సాగిస్తం. –హరీశ్‌రావు



చల్‌గల్‌లో ట్రాక్టర్ నడుపుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

ఇండ్లు కూల్చిన చోట పాదయాత్ర చెయ్

ప్రజలను మభ్యపెట్టేందుకు రేవంత్‌రెడ్డి మూసీ పాదయాత్ర మొదలు పెట్టారని, ఆయనకు దమ్ముంటే ఇండ్లు కూలగొట్టిన చోట చేయాలని హరీశ్ సవాల్ విసిరారు. తలను వదిలిపెట్టి, తోకను పట్టినట్టు నల్లగొండ జిల్లా పరిధిలో పాదయాత్ర చేస్తున్నాడని ఎద్దేవాచేశారు. జగిత్యాల నుంచే వేములవాడ రాజన్న, కొండగట్టు అంజన్న కోటిలింగాల శివన్న, ధర్మపురి నర్సన్నను వేడుకుంటున్నానని, వారిపై ఒట్టు పెట్టి మాట తప్పిన రేవంత్‌రెడ్డిని క్షమించి, రైతులను కాపాడాలని కోరుకుంటున్నానని తెలిపారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం వానకాలం, యాసంగికి కలిపి ఎకరాకు రూ.15 వేల రైతు భరోసా ఇవ్వాలని, అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రైతు సమస్యల పరిష్కారానికే పాదయాత్ర

ఎమ్మెల్యే సంజయ్

రైతులే దేశానికి వెన్నెముక అని, వారి సంక్షేమం కోసమే పాదయాత్ర చేశానని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల తెలిపారు. రైతులు, ప్రజలు పడుతున్న కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, వాటిని పరిష్కరింపజేయాలన్న తలంపుతోనే పాదయాత్ర చేపట్టినట్టు వివరించారు. పాదయాత్ర సందర్భంగా అనేక సమస్యలు తమ దృష్టికి వచ్చాయని, వాటి పరిష్కారం కోసం పోరాడుతామని చెప్పారు. అనంతరం మాజీ మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీలు ఎల్ రమణ, దేశపతి శ్రీనివాస్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల, జడ్పీ మాజీ చైర్‌పర్సన్లు, తుల ఉమ, దావ వసంత, మాజీ ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, కోరుకంటి చందర్, పుట్ట మధు, చల్మెడ లక్ష్మీనర్సింహారావు, వొద్దినేని హరిచరణ్‌రావు, డాక్టర్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి తదితరులు కలెక్టరేట్‌కు వెళ్లి వినతి పత్రం అందజేశారు. విలేకరుల సమావేశంలో వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు, తుల ఉమ, న్యాలకొండ అరుణ, తోట ఆగయ్య, రామతీర్థపు మాధవీ, ఏనుగు మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులను విడుదల చేయాలి: హరీశ్

హైదరాబాద్, నవంబర్ 12 (నమస్తేతెలంగాణ): ఫార్మా కంపెనీకి భూములిచ్చేందుకు నిరాకరించిన లగచర్ల వాసులపై సర్కారు అర్ధరాత్రి దమనకాండకు దిగడం అమానుషమని హరీశ్‌రావు మండిపడ్డారు. అరెస్ట్ చేసిన రైతులను భేషరతుగా విడుదల చేయాలని ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు. 300 మంది పోలీసులతో గ్రామాన్ని దిగ్బంధించడం దారుణమని పేర్కొన్నారు. ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా భూసేకరణ చేపట్టడం వెనుక రేవంత్‌రెడ్డి వ్యక్తిగత ప్రయోజనాలున్నాయని విమర్శించారు. రైతులను ఇబ్బంది పెట్టకుండా, ప్రభుత్వం వెంటనే భూసేకరణ నిలిపివేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

పెద్దపల్లిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్. చిత్రంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, మాజీ ఎమ్మెల్యేలు పుట్ట మధుకర్, దాసరి మనోహర్‌రెడ్డి

420 హామీల అమలేది?

- 11 నెలల్లో ఏం ఒరగబెట్టారని సంబురాలు జరుపుతారు?
- విజయోత్సవాలకు వ్యతిరేకంగా ప్రజావంచన దినాలు నిర్వహిస్తాం
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ధ్వజం

పెద్దపల్లి, నవంబర్ 12 (నమస్తే తెలంగాణ): 'కాంగ్రెస్ 11 నెలల పాలనలో ప్రజలకు ఏం ఒరగబెట్టారని ఈ నెల 14 నుంచి ప్రజా విజయోత్సవాలు నిర్వహిస్తున్నారో చెప్పాలి. 420 హామీల అమలేది? వాటిల్లో ఒక్కటైనా అమలు చేశారా? అసలు ఏ ముఖం పెట్టుకొని ప్రజల్లోకి వెళతారు' అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ సంబురాలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రజా వంచన దినాలను నిర్వహిస్తామని చెప్పారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, మాజీ ఎమ్మెల్యేలు పుట్ట మధూకర్, దాసరి మనోహర్‌రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలతో గెలిచిందని, 11 నెలల పాలనలో చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. పదేండ్లలో బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తే.. కాంగ్రెస్ 11 నెలల్లోనే నాశనం చేసిందని విమర్శించారు.

విద్యుత్తు మంత్రుల సమావేశానికి 'భట్టి'

హైదరాబాద్, నవంబర్ 12(నమస్తే తెలంగాణ): దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన విద్యుత్తుశాఖ మంత్రుల సమావేశానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హాజరయ్యారు. భట్టితోపాటు ఇంధనశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ పాల్గొన్నారు. రాష్ట్రానికి సంబంధించిన విద్యుత్తు అంశాలపై కేంద్ర విద్యుత్తుశాఖ మంత్రి మనోహర్‌లాల్ కట్టర్‌తో భట్టి చర్చించారు.

ఢిల్లీ వెళ్లిన గవర్నర్

హైదరాబాద్, నవంబర్ 12 (నమస్తే తెలంగాణ): నాలుగు రోజుల పర్యటన కోసం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు మంగళవారం ఢిల్లీకి వెళ్లారు. ఉదయం 11 గంటలకు రాజ్‌భవన్ నుంచి బయల్దేరిన ఆయన మధ్యాహ్నానికి ఢిల్లీ చేరుకున్నారు. 13, 14, 15 తేదీల్లో ఢిల్లీ, హర్యానాల్లో నిర్వహించే పలు కార్యక్రమాలకు ఆయన హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ఆయా ప్రదేశాల్లో గవర్నర్‌కు జెడ్‌ప్లస్ క్యాటగిరీ భద్రత కల్పించాలని ఢిల్లీ సీపీ, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్‌ను రాష్ట్ర ఇంటెలిజెన్స్ అధికారులు కోరారు.

నల్లగొండలో పత్తి రైతుల రాస్తారోకో

మర్రిగూడ, నవంబర్ 12: పత్తి పంటను ఎలాంటి టార్గెట్ లేకుండా సీసీఐ అధికారులు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని పత్తి రైతులు మంగళవారం సాయంత్రం యరగండ్లపల్లిలోని శ్రీలక్ష్మీనర్సింహ స్వామి కాటన్‌మిల్లు ఎదుట రాస్తారోకో చేశారు. వరసగా మూడురోజుల నుంచి పత్తి కొనుగోళ్లు జరగలేదని, తిండి, నిద్ర లేకుండా సీసీఐ కేంద్రం వద్ద పడిగాపులు గాస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. మొన్నటి వరకు తేమశాతం పేరుతో అధికారులు పత్తిని కొనకుండా ఇబ్బంది పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడే మో రోజుకు 1,200 నుంచి 1,500 క్వింటాళ్ల వరకే కొంటామని చెప్పి టార్గెట్ అయిపోయిందంటూ గేటుకు తాళం వేస్తున్నారని వాపోయారు. పత్తిని తీసుకొచ్చిన వాహనాలకు వెయిటింగ్ చార్జీ పడటమే కాకుండా తేమశాతం కూడా పెరిగి తాము తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. వందల మంది రైతుల రాస్తారోకోతో వాహనాలు భారీగా నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ధర్నాను విరమింపజేశారు.

నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం యరగండ్లపల్లి లక్ష్మీనర్సింహ స్వామి కాటన్ మిల్లు ఎదుట రాస్తారోకో చేస్తున్న పత్తి రైతులు

కల్వకుర్తి మండలం ఎలికట్టలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

బోనస్ ముందే ఇస్తే మా విలువ ఎట్లా తెలుస్తది?

- సన్నాలు అమ్మిన నెలకు బోనస్ ఇస్తాం
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి వెల్లడి

మహబూబ్‌నగర్, నవంబర్ 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'సన్న వడ్లకు వెంటనే బోనస్ రూ.500 చెల్లిస్తే మా ప్రభుత్వం విలువ మీకెట్ల తెలుస్తుంది, సన్నవడ్లు కొనుగోలు కేంద్రాల్లో అమ్మిన తర్వాత నెలరోజులకు బోనస్ చెల్లిస్తాం' అంటూ చావు కబురు చల్లగా చెప్పారు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం ఎల్లికట్ట గ్రామంలో మంగళవారం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సన్నాలకు ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తుందని చెప్పారు. అయితే ఈ విషయం రైతులకు తెలియడం కోసం సన్నాలు అమ్మిన నెలరోజులకు బోనస్ ధర రూ.500 ఇస్తామని తెలిపారు. 'మా ప్రభుత్వ విలువను కాపాడుకునేందుకు బోనస్ ధర ప్రత్యేకంగా ఇస్తాం.. ఇది వాస్తవం.. అందరూ ఒప్పుకోవాలి.. బోనస్ ధర భరిస్తున్నప్పుడు మా గొప్పతనం తెలిపేందుకు నెల రోజుల తర్వాత బోనస్ డబ్బులు ఇస్తాం' అని అన్నారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.